

నల్లజర్లలో పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి

ఓటింగ్ ఇలా.. ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఆరు జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ శాతం ఇలా నమోదైంది.

జిల్లా	కేంద్రాలు	ఓట్లు	పోలైనవి	శాతం
అల్లూరి	12	637	565	88.70
తూర్పు	20	2990	2753	92.07
ఏలూరు	20	2667	2444	91.64
కాకినాడ	22	3418	3118	91.22
కోనసీమ	22	3296	3138	95.21
పశ్చిమ	20	3729	3484	93.43
మొత్తంగా	116	16737	15502	92.62

92.62%

ఓటెత్తారు!



ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

ఓటు విలువ తెలిసినోళ్లు.. తమకు నచ్చిన.. తాము మెచ్చిన నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటెత్తారు.. జరిగేది ఉప ఎన్నికైనా ఎక్కడా వెనక్కి తగ్గలేదు.. తాయిలాల్లేకున్నా.. గిఫ్ట్ బాక్సులు ఇవ్వకున్నా.. పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు.. 60 శాతం.. 70 శాతం కాదు.. ఒక దశలో నూరుశాతం ఓటింగ్ ఉంటుందా అనేటంతగా క్యూకట్టారు.. చివరికి ఆరు జిల్లాల పరిధిలో 92.62 శాతం మంది బ్యాలెట్ ఓటేశారు.. మరో మూడు రోజుల్లో మా.. స్టారెవరో తేలిపోనుంది.. ఎందుకంటే 9న కౌంటింగ్.. అదే రోజు ఫలితం వెల్లడిస్తారు.. మొత్తం మీద ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ఉపపోరు గురువారం ప్రశాంతంగా ముగిసింది.

కాకినాడలో 91.22 శాతం

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మాస్టార్లు ఓటెత్తారు. ఓటుకు క్యూకట్టారు. నూరుశాతం దిశగా ఓటింగ్ సాగింది. ఆరు జిల్లాల పరిధిలో ఎక్కడా ఓటింగ్ తగ్గుముఖం పట్టలేదు. దూరాన్ని సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. మహిళా ఉపాధ్యాయినులు పోటెత్తారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాల్లో 92.62 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 16737 మంది ఓటర్లకు 15,502 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరిగింది. కాకినాడ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి ఏఆర్వో ఆధ్వర్యంలో వివిధ పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని నిత్యం పర్యవేక్షించారు. కంట్రోల్ రూమ్ నుంచి ప్రతి రెండు గంటలకు ఓటింగ్ శాతం విడుదల చేశారు. ఎన్నికల సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కాకి నాడ జేఎన్‌టీయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. అన్ని జిల్లాల నుంచి గురువారం రాత్రి స్ట్రాంగ్‌రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు చేరుకున్నాయి. పోలింగ్ సిబ్బంది నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకునేందుకు ప్రత్యేక రిసెప్షన్ కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి కాకినాడ జేఎన్‌టీయూలో ఈనెల 9వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదే రోజు సాయంత్రానికి ఫలితాలను వెల్లడిస్తారు. ఐదుగురు అభ్యర్థులు పోటీపడుతుండగా, విజేత ఎవరో తేలిపోతుంది. 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగుస్తుంది.

- ఎక్కడికక్కడ క్యూకట్టిన టీచర్లు
- ఉత్సాహంగా బ్యాలెట్ ఓటు
- ఆరు జిల్లాల పరిధిలో ఇదే సీన్
- 116 కేంద్రాల్లో పోలింగ్
- బరిలో ఐదుగురు అభ్యర్థులు
- కోనసీమలో అత్యధిక ఓటింగ్
- అల్లూరి జిల్లాలో అత్యల్పం
- కాకినాడలో కంట్రోల్ రూమ్‌లు
- జేఎన్‌టీయూలో స్ట్రాంగ్ రూమ్
- రాత్రికే తరలిన బాక్సులు
- 9న కౌంటింగ్.. ఫలితం
- 12 వరకూ ఎన్నికల కోడ్





రాజమహేంద్రవరంలో పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్



కాకినాడలో ఓటేస్తున్న ఉపాధ్యా...



అమలాపురంలో ఓటేస్తున్న టీచర్



తూర్పున 92.07 శాతం

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లాలో 92.07 శాతం ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో మొత్తం 2990 మంది ఓటర్లు ఉండగా 2753 మంది ఓటేశారు. 237 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. ఉదయం 10 గంటలకు 20.90 శాతం, 12 గంటలకు 51.70 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 74.28 శాతం, సాయంత్రం 4 గంటలకు 90.54 శాతం పోలైంది. మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కొంత మంది టీచర్లు ఓటు హక్కు వినియోగించుకోలేదు. ప్రభుత్వ ఉపాధ్యాయులంతా ఓటు హక్కు వినియోగించుకున్నట్టు చెబుతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసేవారే కొంతమంది రాలేదనేది సమాచారం.జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజిలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.వీటిని జిల్లా రెవిన్యూ అధికారి (డీఆర్వో) టి.సీతారామమూర్తి,ఆర్డీవోలు ఆర్. కృష్ణనాయక్,రాణి సుస్మిత, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ దేవి తదితరులు పర్యవేక్షించారు. ఎన్నికల పరిశీలకుడు కె.హర్షవర్ధన్ స్ట్రాంగ్ రూమ్ ఇక్కడ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.నల్లజర్లలో పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి పరిశీలించారు.



కాకినాడలో పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయినికి సిరా చుక్క



పిఠాపురంలో కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేకాధికారి హర్షవర్ధన్



రాజమహేంద్రవరంలో పోలింగ్ సామగ్రి అప్పగిస్తున్న సిబ్బంది

కాకినాడలో ఓటేస్తున్న టీచరమ్మ



3 ఓట్లు.. 150 కి.మీ

వై.రామవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం ఎగువ ప్రాంతమైన డొంకరాయి 6వ నెంబరు పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడే ఓట్లు ఉన్నాయి. వై.రామవరం నుంచి ఎన్నికల నిర్వహణ సిబ్బంది 150 కిలోమీటర్లు తరలివెళ్లి పోలింగ్ నిర్వహించారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారని జోనల్ అధికారి బావన్నదొర చెప్పారు.



కోనసీమలో 95.21 శాతం

అమలాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. 22 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచే ఓటింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. 95.21 శాతం మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు తెలిపారు. ఉదయం పోలింగ్ ప్రక్రియ మందకొడిగా ప్రారంభమైనప్పటికీ మధ్యాహ్నానికి ఊపందుకుంది. జిల్లాలో 3296 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 3138 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 158 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 2165 మంది పురుష ఓటర్లకు 2060 మంది, 1131 మంది మహిళా ఓటర్లకు 1078 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 95.21 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్ నంబరు 60లో అత్యధికంగా 606 మంది ఓటర్లు ఉండగా 574 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 94.72 శాతం నమోదైంది.



కరప సమీపంలో 51 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం

సుబ్రహ్మణ్య నమోస్తుతే!!

షష్ఠి ఉత్సవాలకు సర్వం ముస్తాబు

బిక్కవోలు, ఏ వేమవరం, కరప, తాటిపర్తి, ఆలవెల్లి మల్లవరంలలో భారీ ఏర్పాట్లు

నేటి నుంచే కార్యక్రమాలు..

రేపే షష్ఠి

శనివారమే సుబ్రహ్మణ్య షష్ఠి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రసిద్ధ సుబ్రహ్మణ్య ఆలయాలన్నీ ఈ ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. ఇక కోనసీమలో, కాకినాడ జిల్లాలోనూ అతి పెద్ద విగ్రహాలు ఉన్నాయి. అలాగే ప్రసిద్ధ ఆలయాలపై ప్రత్యేక కథనం.. - 6లో

మా బడికి రండి నాన్నా..

- రేపటి నుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం
- ఉత్సవ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు

శంఖవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మా బడికి రండి అమ్మానాన్నా.. అంటూ పిల్లల నుంచి తల్లిదండ్రులకు ఆహ్వానాలు అందుతున్నాయి. ప్రతి పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని ఉత్సవ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాఠశాలలో ఈ సమావేశాలు నిర్వహించి పాఠశాలలో లోటుపాట్లు ఉపాధ్యాయులు, చదువు, పిల్లల్లో బలహీనతలు తల్లిదండ్రులు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈనెల 7న నిర్వహించే ఈ కార్యక్రమాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని సూచిస్తోంది.

తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు

పాఠశాలలో సమావేశానికి హాజరైన తల్లిదండ్రులకు ముగ్గులు పోటీలు, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందిస్తారు. పూర్వపు విద్యార్థులను పిలిచి వారి విజయగాథలను విద్యార్థులకు వివరిస్తారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్న భోజనంతో ఈ కార్యక్రమం ముగుస్తుంది. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు అందిస్తారు. ఇందులో చదువు, ఆటలు, మార్కులు, పాఠశాలలో వ్యవహరించే తీరు వంటి అంశాలు పొందిపరిచి ఉంటాయి. సోషల్ మీడియాలో పిల్లలు ఎలా ఉంటున్నారో గమనించడంతోపాటు తగిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు వివరిస్తారు.

తల్లిదండ్రులను దగ్గర చేయడానికే..

ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను వారి తల్లిదండ్రులను దగ్గర చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. విద్యార్థులు ఏఏ అంశాల్లో చురుగ్గా ఉంటున్నారో ఉపాధ్యాయులకు వివరించడం ఆయా అంశాల్లో మరింత శిక్షణ ఇప్పించడం, క్రీడలు, సైన్స్ వంటి వాటిలో విద్యార్థుల ఆసక్తిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పంచుకోవడం ద్వారా వాటిని మరింతగా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది. విద్యార్థులే స్వయంగా తమ సృజనాత్మకతను ఉపయోగించి ఆహ్వాన పత్రికలు తయారుచేసి తల్లిదండ్రులను ఆహ్వానించేలా కార్యక్రమాలు చేసేలా విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

విద్యాశాఖ సమాయత్తం

తల్లిదండ్రులతో సమావేశాలు విద్యాశాఖకు కొత్త కాకపోయినా ఈసారి భేటీ ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సమావేశాల్లో ఎన్నడూలేని విధంగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు విడుదల చేసింది ప్రభుత్వం. పదిమందిలోపు ఉన్న పాఠశాలలకు వెయ్యి, 300 నుంచి 400 వరకూ విద్యార్థులు ఉన్న పాఠశాలకు రూ.5 వేలు ప్రభుత్వం అందిస్తుంది. జిల్లా సర్వశిక్షాభియాన్ ఉన్నతాధికారులు, సెక్టోరల్ అధికారులు, ఎంఈవోలు ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు అందుతున్నాయి.

మెగా పేరెంట్- టీచర్స్ మీట్స్ విజయవంతం చేయాలి : కలెక్టర్

కాకినాడసిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలు చదువుతున్న పాఠశాలల్లో వసతులు, విద్యాబోధన మెరుగుపరిచే నిమిత్తం ఈనెల 7న జిల్లా అంతటా నిర్వహిస్తున్న మెగా పేరెంట్-టీచర్స్ సమావేశాల్లో తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. మెగా పేరెంట్-టీచర్స్ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం అమరావతి నుంచి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కమిషనర్ కోన శశిధర్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షాన్ మోహన్ విద్యాశాఖ అధికారులతో కలిసి హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ విద్యాబోధన నాణ్యతను పెంచడంతోపాటు మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఈవో పి.రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కాకినాడలో బాలకృష్ణ, సంయుక్త మీనన్ సందడి

కాకినాడ నగరంలో వేగ జ్యూయలర్స్ షోరూమ్ గురువారం ప్రారంభమైంది. వేగ జ్యూయలర్స్ బ్రాండ్ అంబాసిడర్, సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ప్రముఖ సినీ తార సంయుక్త మీనన్‌తో కలిసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరిద్దరూ సందడి చేశారు. బాలకృష్ణ వస్తున్నారన్న సమాచారంతో ఆయన అభిమానులు పెద్దఎత్తున చేరుకోవడంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. - 6లో



కోనపాపపేటలో మత్స్యకారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, ఆర్డీవో మల్లిబాబు

కరపలో మద్యం షాపు సీజ్

కరప, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం కరపలోని 115 నంబరు మద్యంషాపును సీజ్‌చేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తాళ్లరేవు సీఐ కె.కోటేశ్వరరావు తెలిపారు. కరపమండలం పెనుగుదురులోని ఒక బెల్ట్‌షాపుపై గత నెల 22వ తేదీన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించి 126 మద్యం సీసాలు, 4 బీర్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్‌చేశారు. కరపలోని 115వ నెంబరు లైసెన్స్‌డ్ మద్యంషాపు నుంచి ఈ మద్యాన్ని కొనుగోలు చేసినట్టుగా అధికారుల విచారణలో నిర్ధారణైంది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న మద్యంషాపు లైసెన్స్‌ను ఎక్సైజ్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఎక్సైజ్ సూపరిండెంట్ ఎస్.కృష్ణకుమారి ఆదేశాల మేరకు తాజాగా మద్యంషాపును సీజ్‌చేసినట్టు సీఐ కోటేశ్వరరావు వివరించారు. కాగా కరపలో మరో ప్రధాన మద్యంషాపు వద్ద సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటుచేసినా అధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

సముద్రంలో వేసిన పైప్‌లైన్ తొలగించాలని మత్స్యకారుల బైఠాయింపు

మాజీ ఎమ్మెల్యే వర్మ హామీతో ఆందోళన విరమణ

కొత్తపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సెజ్‌లో నెలకొల్పిన లైఫిజ్ రసాయన కంపెనీ సముద్రంలోకి ఏర్పాటుచేసిన పైప్‌లైన్‌ను తొలగించాలని, మత్స్యకారుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు గురువారం ఆర్అండ్‌బీ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. కోనపాపపేట మీదుగా బీచ్‌రోడ్డున తుని వెళ్లే ప్రధాన రహదారులన్నీ మత్స్యకారులు బంద్ చేశారు. దీంతో మూలపేట నుంచి నాగులాపల్లి మీదుగా ట్రాఫిక్ మళ్లించారు. ఉదయం 6 గంటల నుంచి గ్రామంలో మత్స్యకారులు అందరూ రోడ్డుకు చేరి ధర్నాలో పాల్గొన్నారు. సెజ్‌లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల కారణంగా మత్స్య సంపద అంతరించి తద్వారా జీవనోపాధికి ఆటంకం ఏర్పడుతుందని, సముద్రంలోకి ఏర్పాటుచేసిన పైప్‌లైన్ తొలగించాలని, అదేవిధంగా రసాయన పరిశ్రమల నుంచి రూ.6కోట్లు ముడుపులు తీసుకొన్న మత్స్యకారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, జిల్లా కలెక్టర్ సమక్షంలో సమస్యను పరిష్కరించేవరకు ఆందోళన విరమించేదని లేదని మత్స్యకారులు స్పష్టంచేశారు.

మాజీ ఎమ్మెల్యే వర్మ చొరవతో ఆందోళన విరమణ

మత్స్యకారులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే వర్మ సందర్శించారు. ఎన్నికల ముందు రసాయన పరిశ్రమల కాలుష్యంపై పోరాటంచేసిన సభ్యులకు పరిశ్రమల యాజమాన్యం డబ్బులు ముట్టజెప్పారన్న ఆరోపణలు, రసాయన పరిశ్రమల వల్ల సముద్రంలో మత్స్యసంపద అంతరించి జీవనోపాధికి ఆటంకం ఏర్పడుతుందని, తమకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వలేదని, తుని నియోజకవర్గంలో మత్స్యకారులకు రేషన్‌కార్డు ఆధారంగా డబ్బులు ఇచ్చారనే ఆరోపణలను తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే వర్మ కలెక్టర్ షాన్ మోహన్‌కు ఫోన్‌లో వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో ఎస్.మల్లిబాబు చేరుకుని మత్స్యకారులతో చర్చించారు. నష్టపరిహారం చెల్లించారన్న ఆరోపణలపై ఈనెల 20న అరబిందో ఫార్మా కంపెనీతో చర్చిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సుబ్రహ్మణ్యా నమోస్తుతే!!

ఆకాశమంత భక్తి... ఎ.వేమవరంలో 42 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం

కరప-పెనుగుదురు రోడ్డులో కోరుపల్లి వద్ద 51 అడుగుల అతి పెద్ద విగ్రహం

షష్ఠి ఉత్సవాలకు ముస్తాబైన బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు

తాటిపర్తి, మల్లవరంల్లోనూ పూర్తయిన ఏర్పాట్లు.. రేపే షష్ఠి పండుగ

శనివారం జరిగే సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలకు ఆయా ఆలయాలన్నీ ముస్తాబు అయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలెన్నో ప్రసిద్ధి చెందినవి ఉన్నాయి. ఇందులో ప్రధానంగా బిక్కవోలులోని శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం అతి పురాతనమైంది. పంచారామాలకంటే ముందు ఈ ఆలయాన్ని నిర్మించారని చరిత్ర కథనం. ఇక అమలాపురం మండలం ఎ.వేమవరం గ్రామంలో అతి పెద్ద సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల్లో ఒకటిగా 42 అడుగులతో దర్శనమిస్తోంది. అలాగే కరప సమీపంలో 51 అడుగుల మరో విగ్రహం ఉంది. వీటితోపాటు గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి, ఆలవెల్లి మల్లవరంలలో ఉన్న ఆలయాలు స్వయంభూ కావడంతో ప్రసిద్ధ క్షేత్రాలుగా వెలుగొందుతున్నాయి. ఆ విశేషాలు ఇవీ...





ఎ.వేమవరంలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం.. కరపలో 51అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం

మలేషియా తరహాలో ఎ.వేమవరంలోనూ..

నేడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



ఎ.వేమవరంలో కొలువుదీరిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

అమలాపురం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి అతిపెద్ద విగ్రహాల్లో ఒకటి అమలాపురం మండలం ఎ.వేమవరం గ్రామంలో ఉంది. ఇందులో 42 అడుగుల ఎత్తులో ఉన్న ఈ విగ్రహాన్ని మలేషియా తరహాలో ఇక్కడ నిర్మించినట్టు ఆలయ వ్యవస్థాపకులు తెలిపారు. స్వామివారికి రక్షణ పడగగా 45 అడుగుల నాగరాజు నిలబడి ఉండడం మరో విశేషం. ఎ.వేమవరంలో ప్రసిద్ధినొందిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి 6.30 గంటలకు గూడా సత్యహరిశ్చంద్రుడు కుటుంబీకుల ఆధ్వర్యంలో స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. 85 ఏళ్ల కిందట నిర్మించిన ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. దేవస్థానం చైర్మన్ కొంపెల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామికల్యాణోత్సవాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

బ్రహ్మజాతి దేవతాసర్పం సంచారం..

ఎ.వేమవరంలో ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రాంతంలో పెద్ద పాముల పుట్ట ఉండేది. ఆ ప్రాంతంలో బ్రహ్మజాతి దేవతాసర్పం సంచరిస్తూ ఉండేదని నాటి పూర్వీకులు నేటికీ చెబుతున్నారు. ఆ పుట్టపై పంచ శిరస్సుల సర్పాకృతితో ఒక గుమ్మడిపాదు పెరిగింది. పశ్చిమాభిముఖంగా గుమ్మడి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వెలిసినట్టు అక్కడే ఆలయాన్ని నిర్మించమని ఓ భక్తురాలికి కలలో కనిపించి చెప్పినట్టు కథనం. స్థలదాత, సీనియర్ న్యాయవాది దివంగత గూడా సత్యహరిశ్చంద్రుడు భక్తురాలి కలను నిజం చేస్తూ ఆలయాన్ని నిర్మించారు. సంతాన సుబ్రహ్మణ్యేశ్వరునిగా, గుమ్మడి సుబ్రహ్మణ్యేశ్వరునిగా ఈ ఆలయం ప్రసిద్ధినొందింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం అనంతరం 7న షష్ఠితీర్థం జరుగుతుంది.

కరపలో 51 అడుగుల విగ్రహం

కరప, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని కరప-పెనుగుదురు ప్రధాన రహదారిలో కోరుపల్లి పరిధిలో ఉన్న 51 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంటుంది. ఇక్కడ జనసేన నేతలు చిక్కాల దొరబాబు, సుబ్బారావు ఆధ్వర్యంలో షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లుచేశారు. అదేవిధంగా కరపలో చాగంటి వంశీకులు నిర్మించిన ఆలయంలో ధర్మకర్త చాగంటి వెంకట్రావు, వేళంగిలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో షష్ఠి వేడుకలు అట్టహాసంగా జరగనున్నాయి.





సహజసిద్ధమైన పుట్టతో దర్శనమిస్తున్న బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సంతానాన్నిచ్చే బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడు సంతానం లేని స్త్రీలకు సంతాన్నిచ్చే స్వామిగా ప్రసిద్ధికెక్కాడు. ఈ స్వామికి మార్గశిర శుద్ధ షష్ఠి రోజున స్వామివారి షష్ఠి మహోత్సవాన్ని వైభవంగా ఏళ్ల తరబడి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఈ నెల 6 నుంచి 12 వరకూ షష్ఠి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. షష్ఠి ఉత్సవాన్ని 7న నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ చరిత్ర చూస్తే.. ఈ ఆలయాన్ని పంచారామాలకంటే 300ఏళ్ల ముందే తూర్పు చాళుక్యులు నిర్మించగా 1100 ఏళ్ల చరిత్రను కలిగి ఉంది. ఈ క్షేత్రాన్ని మొదట తూర్పు చాళుక్య విజయాదిత్యుని కాలంలో విక్రమపురంగాను, మూడో విజయాదిత్యుడిగా పేరొందిన గుణగవిజయాదిత్యుని కాలంలో బిరుదాంకినవోలుగాను, ఆపై కాలక్రమేణా బిక్కవోలుగా నామాంతరం చెందింది. ఈ ఆలయంలో శైవ కుటుంబం మొత్తం కొలువై ఉండడం ఈ దేవాలయ ప్రత్యేకత. దీనికి మధ్యలో గోలింగేశ్వరుడు, పార్వతి అమ్మవారు, లక్ష్మీగణపతి, భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరుడు, సహజమైన పుట్టతో శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉన్నారు. గోలింగేశ్వరస్వామి ఆలయానికి ఎడమవైపు బాలాత్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి, కుడివైపు రాజరాజేశ్వరీదేవి సమేత రాజరాజేశ్వరస్వామివారి ఆలయాలు ఉన్నాయి. దీంతో త్రిలింగ క్షేత్రంగా కూడా పేరొందింది.

సుబ్రహ్మణ్యస్వామి చరిత్ర..

తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలులో శ్రీకుమారసుబ్రహ్మణ్యేస్వామి సహజమైన పుట్టతో దర్శనమిస్తారు. సంతానం లేని స్త్రీలకు సంతాన ప్రాప్తినిచ్చే స్వామిగా పేరొందాడు. తమిళనాడులోని పళనిలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిలా దక్షిణాభిముఖంగా ఈ స్వామి భక్తులకు దర్శనమిస్తూ ఉండడంతో బిక్కవోలు గ్రామం కూడా కుమారక్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది. స్వామికి ఇష్టమైన మంగళవారం, శుద్ధ షష్ఠి, కృత్తికా నక్షత్రం రోజుల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాహు, కేతు, కుజ, సర్ప దోష నివారణార్థం భక్తులతో పూజలు చేయిస్తుంటారు. మిగిలిన రోజుల్లో స్వామివారి వద్ద ఉన్న సర్పానికి పూజలు చేయడం ఇక్కడ ప్రత్యేకత. సంతానం లేని స్త్రీలు షష్ఠి రోజున స్వామి చెంతనే ఉన్న సహజపుట్టపై నాగులచీర ఉంచి దాన్ని ధరించి ఆలయం వెనుక శయనిస్తే సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం.

బాణసంచా ప్రత్యేక ఆకర్షణ

షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు కాల్చే బాణసంచా ప్రత్యేక ఆకర్షణ.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఈనెల 7న నిర్వహించే సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జేవీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాలకు రూ.80 లక్షల వరకూ వ్యయం చేయనున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి రూ.లక్షకుపైగా భక్తులు స్వామి దర్శనానికి వస్తారని, వీరందరికీ స్వామి దర్శనాలు కల్పించడానికి భారీ క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, 12న మహాన్నదానంతో ఉత్సవాలను ముగిస్తామని చెప్పారు.





తాటిపర్తిలో వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పక్కన స్వామి నిజరూప దర్శనం (ఫైల్)





ఆలవెల్లి మల్లవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పక్కన స్వామి నిజరూప దర్శనం

స్వయంభూగా వెలసి.. వరాలిస్తూ..

గొల్లప్రోలురూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠికి ఆలయాలు ముస్తాబయ్యాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి, ఏపీ మల్లవరం గ్రామాల్లో స్వయంభూగా వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ఈనెల 7 నుంచి షష్ఠి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయాలు ముందు సంప్రదాయబద్ధంగా పందిర్లు వేశారు. విద్యుత్‌దీపాలతో అలంకరించారు. తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లో ఉన్న వారి గృహాలకు వివిధ ప్రాంతాల నుంచి బంధువుల రాక ఇప్పటికే ప్రారంభమైంది.

తాటిపర్తి క్షేత్రప్రాశస్త్యం

గొల్లప్రోలు మండలంలో తాటిపర్తి గ్రామంలో వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్వయంభూగా వెలిశారు. ఇక్కడ ఉన్న స్వామి విగ్రహంవద్ద పాము కొంతకాలంపాటు ఉండి అక్కడే చనిపోవడంతో ఆ స్థానంలో ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడికి సమీపంలోనే అపర్ణాసమేత నాగేశ్వరస్వామి ఆలయం ఉండడంతో మరింత ప్రాశస్త్యం లభించింది. సంతాన ప్రాప్తికి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఎరుపురంగు చారల చీర కట్టుకుని రాత్రంతా నిద్రిస్తే మంచిదని భక్తుల నమ్మిక. ఈ వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 87వ షష్ఠి బ్రహ్మోత్సవాలు ఈనెల 7న ప్రారంభమై 12 వరకూ జరుగుతాయి. శనివారం తెల్లవారుజామున స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం, రాత్రి శూలాల సంబరం, చెట్టుభజన, తాడిపెద్దు సంబరం జరుగుతాయి. అనంతరం స్వామి కల్యాణం జరుగుతుంది. 11న స్వామి గ్రామోత్సవం, 12న స్వామి షట్ సహస్ర నామార్చన, రాత్రి పుష్కరిణిలో తెప్పోత్సవం జరుగుతాయి. 6న స్వామి, అమ్మవార్లకు పెండ్లి కుమారుడు, కుమార్తె అలంకారం, అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహిస్తారు.

ఆలవెల్లి మల్లవరం విశిష్టత..

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా దర్శనమిచ్చిన క్షేత్రమిది. సర్పరూపంలో భక్తులకు దర్శనమివ్వగా అక్కడే ఆలయాన్ని నిర్మించారు. 1961-64 సంవత్సరాల మధ్య ఆలవెల్లి మల్లవరంలోని పంటపొలాల్లో సర్పం రైతులకు కనిపించి కదలకుండా ఉండిపోయింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా కనిపించాడని భావించిన ప్రజలు పూజలు నిర్వహించి అక్కడే ఆలయం నిర్మించారు. వీరచోళ చతుర్వేద మండలం ఆలవెల్లి నిలయ మల్లవరం క్షేత్రం స్వామి కళ్యాణమహోత్సవాలు 7 నుంచి 11 వరకూ జరగనున్నాయి. 13న కల్యాణవేదిక పైఅంతస్తును ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రారంభిస్తారు.



అష్ట లక్ష్మీ సమేత వాహనంపై ఊరేగుతున్న స్వామివార్లు

వైభవంగా అనపర్తిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి ఉత్సవం

అనపర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): షష్ఠి వేడుకల సందర్భంగా అనపర్తిలోని వీర్రాజు మామిడి వద్ద కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాన్ని ప్రారంభించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఊరేగిస్తూ కావడి ధరించిన మాలధారులు సంతానం లేని మహిళలను దాటుతూ వారికి సంతాన ప్రాప్తి కలగాలని దీవించారు. ఇలా చేస్తే సంతానం కలుగుతుందని ఇక్కడి భక్తులు విశ్వసిస్తారు. రథానికి గ్రామంలో భక్తులు నీరాజనాలు పలికారు. కావడి ధరించిన భక్తులకు పసుపు నీళ్లతో అభిషేకాలు చేశారు. అనపర్తిలో పదకొండేళ్లుగా కావడి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారని ఆలయార్చకుడు చందూశర్మ తెలిపారు. ఉత్సవంలో కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు వోగిరెడ్డి సత్తిరెడ్డి, మండ పోతారెడ్డి, మండ రామారెడ్డి, కర్రి సుధాకరరెడ్డి, తమలంపూడి వీర్రాఘవరెడ్డి, వెలగల గంగిరెడ్డి, బూరయ్య పర్యవేక్షించారు.





సంతానం కోసం ఆలయంలో కావడి ధరించిన మాలధారులు స్త్రీలపై దాటుతూ ఆశీర్వదిస్తున్న దీక్షాధారులు.. కావడి మోస్తున్న సీడీఆర్ ఆసుపత్రి వైద్యురాలు కర్రి బాంధవి



వేగ జ్యూయలర్స్‌ను ప్రారంభించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ



బాలకృష్ణ, సంయుక్త మీనన్‌లను చూడ్డానికి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు, (ఇన్‌సెట్లో) వేగ జ్యూయలర్స్ షోరూం

కాకినాడలో వేగ జ్యూయలర్స్

షోరూమ్‌ను ప్రారంభించిన ప్రముఖ సినీ నటుడు బాలకృష్ణ

హాజరైన సినీ నటి సంయుక్త మీనన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నమ్మకం, నాణ్యత ఆభరణాలుగా ఎన్నో ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రజల విశ్వాసం చూరగొన్న వేగ జ్యూయలర్స్ నాలుగో షోరూమ్ కాకినాడ బాలాజీచెరువు సెంటర్‌లో గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన వేగ జ్యూయలర్స్ బ్రాండ్ అంబాసిడర్, సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ప్రముఖ సినీ తార సంయుక్త మీనన్‌తో కలిసి షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ పుట్టిన రోజు నుంచి ప్రతిరోజు వేడుకలకు అమ్మాయికి కొనుగోలు చేసే బంగారం విలువ ఆమె వయసుతో పాటు పెరుగుతూ వస్తుందన్నారు. బంగారం అంటే ఖర్చు మాత్రమే కాదని అది భవిష్యత్తు తరాలకు సంపదన్నారు. ఇక్కడ ఒక రకం మోడల్ చూపించమంటే వంద రకాల మోడల్స్ చూపిస్తున్నారని నటి సంయుక్త మీనన్ సంతోషంగా అన్నారు. షోరూమ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన బాలకృష్ణ, సంయుక్త మీనన్‌లను చూసేందుకు భారీ స్థాయిలో ప్రేక్షకులు విచ్చేశారు. సంస్థ యాజమాన్య ప్రతినిధులు వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా తమ వేగ జ్యూయలర్స్ ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన బంగారు ఆభరణాలు అందిస్తూ వారి విశ్వాసం పొందాయన్నారు. నూతన షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 12వ తేదీ వరకు ప్రజలకు ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్టు ప్రకటించారు. ప్రతి ఆభరణం పైన వీఏ 4.99శాతం నుంచి 11.99శాతం వరకు ఉంటుందన్నారు. బీఐఎస్ హాల్‌మార్క్ బంగారు ఆభరణాలు సర్టిఫికెట్ తోటి డైమాండ్స్ క్యారట్ ధర రూ.50,999 మాత్రమేనన్నారు. తమ షోరూమ్‌లో సంప్రదాయ ఆభరణాల నుంచి ఆధునిక ఫ్యాషన్ ఆభరణాల వరకు... చిన్న కాసు నుంచి భారీ వడ్డాణాల వరకు, ముక్కుపుడక నుంచి ముత్యాల హారాలు వరకు లభిస్తాయన్నారు. ఎన్నో రకాల ఉంగరాలు, చెవి దుద్దులు, గాజులు, నెక్లెస్‌లు, బ్రాస్‌లెట్స్ అందిస్తున్నామన్నారు. వధువు ధరించే ఆభరణాల నుంచి రోజూ ధరించే ఫ్యాన్సీ ఆభరణాల వరకు, వివాహాల కోసం బహుమతిగా ఇవ్వడం కోసమైనా.... ఇంట్లో జరిగే వేడుక ఏదైనా 'వేగ' తోడుంటే అది మరపురాని మధురానుభూతిని కలకాలం నిలుపుతుందన్నారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు అమన్‌జైన్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

రంపచోడవరం, చింతూరు డివిజన్లలో 88.70 శాతం పోలింగ్

రంపచోడవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మన్యంలో ప్రశాంత వాతావరణంలో జరిగాయని రంపచోడవరం సబ్ కలెక్టరు, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కేఆర్ కల్పశ్రీ తెలిపారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లలో 88.70 శాతం పోలింగ్ జరిగిందన్నారు. 12 పోలింగ్ కేంద్రాల్లో 637 ఓటర్లకు 565 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తెలిపారు. రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని కల్పశ్రీ పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దారు రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్లు సత్యనారాయణ, త్రిమూర్తులు, శ్రీధర్, శివ, ఆర్ఐ జిలాని ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టరు కల్పశ్రీ

8న ఆర్చరీ పోటీలు

పిఠాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 8వ తేదీ ఉదయం 9గంటల నుంచి అమలాపురం సర్ సీవీరామన్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జే ఎన్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. సబ్‌జూనియర్స్ ఆర్చరీ ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ బాలబాలికల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనేవారు 2007, జనవరి 1 తర్వాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. వివరాలకు 9989001162 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

నన్నయలో 9న బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్య కళాశాలలో ఈనెల 9న బీఈడీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. బీఈడీ రెండేళ్ల కోర్సుకు బీఏ, బీకామ్, బీఎస్సీ, బీటెక్ డిగ్రీ పూర్తి చేసి ఎడ్‌సెట్-2024 పరీక్ష రాసిన వారు అర్హులన్నారు. విద్యార్థులు ఈనెల 9న ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి ప్రవేశ రుసుం చెల్లించి అడ్మిషన్ పొందవచ్చునన్నారు. వివరాలకు 70930 08473 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లికి చెందిన ఎడ్ల నాగఫణీంద్ర(27) పచ్చళ్ల వాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పచ్చళ్ల వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన ఫణీంద్ర ఈనెల 3న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గురువారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

కొత్త రేషన్‌కార్డులు.. ఎప్పటినుంచి?

- రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణపై సందిగ్ధత.. స్పష్టత రాని వైనం
- గురువారం రాత్రికి కూడా జారీ కాని మార్గదర్శకాలు
- సచివాలయాలకు వెళ్తున్న అర్హులు
- స్పష్టత లేక తప్పని ఎదురుచూపులు



సామర్లకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకారంపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం ఈనెల 2వతేదీనుంచి సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరణ ప్రారంభిస్తామని ప్రకటించడంతో ఆశావహులు సంతోషం వ్యక్తం చేశారు. సచివాలయాలకు పెద్దసంఖ్యలో చేరుకుని దరఖాస్తుకు ప్రయత్నిస్తున్నారు. కానీ, సచివాలయాలకు నాలుగురోజులుగా ఇందుకు సంబంధించి యాప్ ఓపెన్ కాకపోవడం, ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు సైతం రాకపోవడంతో ఆశావహులకు ఏం చెప్పాలో తెలియని అయోమయ పరిస్థితిని సచివాలయాల సిబ్బంది సోమవారం నుంచి గురువారం రాత్రి వరకూ ఎదుర్కొన్నారు.

సంక్రాంతికి కొత్త కార్డులంటూ..

డిసెంబరు 2 నుంచి 28 వరకూ అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద కొత్త రేషన్‌కార్డులు, ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించబోతోందని, కొత్త డిజైన్లతో రేషన్‌కార్డుల పంపిణీ చేయనుందని కొన్నిరోజులుగా అధికార యంత్రాంగం ప్రచారం నిర్వహించింది. సంక్రాంతి పండుగకి కొత్త కార్డులు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని కూడా కొందరు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి గురువారం సాయంత్రం నాటికి కూడా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కాలేదు. దీంతో దరఖాస్తుదారులకు ఏం చెప్పాలో, దరఖాస్తులు స్వీకరించాలో వద్దో తెలియని అయోమయ పరిస్థితిలో గ్రామ, వార్డు సచివాలయాలసిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారు.

పది నెలలుగా పెండింగ్

ఇంచుమించు 10నెలలుగా కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరించడంలేదు. ఇందుకు సంబంధించి ఈ-పోస్ సైట్‌ని బ్లాక్ చేశారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వచ్చిన దరఖాస్తులు వందల్లో పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారులు తెలిపారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్‌తో రేషన్ కార్డులకు సంబంధించి ఎలాంటి దరఖాస్తులను స్వీకరించడంలేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడగా వైసీపీ రంగులతో ఉన్న రైస్‌కార్డులను తొలగించాలని నిర్ణయించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన రేషన్‌కార్డుల్లో మొత్తం కుటుంబసభ్యుల ఫొటో ఉండేది. అలానే కుటుంబ పెద్ద, వృత్తి, పుట్టిన తేదీ, వయస్సు, వార్షికాదాయం వంటి వివరాలు ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించి రైస్‌కార్డులంటూ సచివాలయాల ద్వారా పంపిణీ చేసింది. ఆ కార్డుల్లో కుటుంబ సభ్యుల ఫొటోను తీసేసి కేవలం ఆ కుటుంబంలో మహిళ ఫొటోను మాత్రమే ఉంచింది. ఆ కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణించలేని పరిస్థితి.

దరఖాస్తుదారుల ఎదురుచూపులు

కొత్తకార్డులు, స్ప్లిట్ కార్డులు, ఇతర సవరణల కోసం పెట్టుకున్న దరఖాస్తులను గతప్రభుత్వం నిలిపివేసింది. ఆరంచెల మూల్యాంకనం ద్వారా వేలల్లో కార్డులను తొలగించింది. ఈ కారణంగా ఇప్పుడు వంటగ్యాస్ సబ్సిడీలకు కూడా కొందరు దూరమయ్యారు. ఇతర సంక్షేమ పథకాలను పొందలేకపోయారు. కాకినాడ జిల్లాలో ఇప్పటికే 16లక్షల20వేల కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. మరో 3.30 లక్షల వరకూ కొత్తకార్డులు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఇంకా అర్హులు మిగిలిపోయి ఉండడంతో వారికి కార్డులు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. తగిన మార్గదర్శకాలు రాకపోవడంతో గురువారం సాయంత్రం వరకూ సచివాలయాలకు దరఖాస్తులతో వచ్చేవారు నిరాశగా వెనుదిరుగుతున్నారు. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులను వివరణ కోరేందుకు గురువారం రాత్రి ప్రయత్నించగా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కావడంలో కాస్త ఆలస్యమైందని స్పష్టం చేశారు.



సామర్లకోట భీమేశ్వరాలయంలో హుండీలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

సామర్లకోట భీమేశ్వరాలయ ఆదాయం

రూ.కోటి34లక్షలు

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో కార్తీక మాసం పర్వదినాలు పురస్కరించుకుని భక్తుల రాక పెరగడమే గాక ఆలయ ఆదాయం సైతం అనూహ్యంగా పెరిగిందని ఆలయ ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. గురువారం సాయంత్రం వరకూ ఆలయంలోని హుండీలు దేవదాయ అధికారులు, సామర్లకోట భక్త జనావళి మధ్య హుండీలు లెక్కించారు. నెలరోజుల పర్వదినాల్లో భక్తులు ద్వారా ఆలయానికి రూ.1కోటి34 లక్షల24వేల198 సమకూరాయన్నారు. వీటిలో హుండీల ద్వారా రూ.24.19లక్షలు, ప్రసాదాల

- కార్తీకమాసంలో పెరిగిన ఆదాయం

విక్రయాల ద్వారా రూ.15.79లక్షలు, నిత్యాన్నదాన విరాళాల ద్వారా రూ.30.95లక్షలు, వివిధ పూజా రుసుములు, దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.48.42లక్షలు, సేవల టికెట్ల ద్వారా రూ.4.76లక్షలు, ఆన్‌లైన్ విరాళాల ద్వారా రూ.10.02లక్షలు, టెంపుల్ డొనేషన్ల ద్వారా రూ.10వేల15 చొప్పున లభించినట్లు తెలిపారు. గత కార్తీకం ఆదాయంతో పోలిస్తే అదనంగా రూ.31.11లక్షలు లభించినట్లు ఈవో తెలిపారు. దేవదాయ అధికారులు వి.ఫణికుమార్, టీవీ సూర్యనారాయణ, కంటే బాబు పాల్గొన్నారు.

అంతర్వేది లక్ష్మీనరసింహుడి కార్తీకమాసం ఆదాయం

రూ.కోటి16లక్షలు

అంతర్వేది, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. కార్తీకమాసం నెలరోజులకు రూ.1,16,11,590 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు. ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.19,37,800, వసతి గదులకు రూ.1,52,437, విరాళాల ద్వారా రూ.84,646, లడ్డూ ప్రసాదానికి రూ.14,25,420, స్వామివారి అభిషేకాలకు రూ.2,58,400, సుదర్శనహోమం ద్వారా రూ.4,37,200, టన్సూర్ ద్వారా రూ.21,250,ఇతర సేవల ద్వారా రూ.52,176, నిత్యాన్నదాన ట్రస్టు ద్వారా రూ.41,12,521, హుండీల ద్వారా రూ.31,29,740, మొత్తం రూ.1,16,11,590 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. స్వామివారి అనుబంధ దేవాలయమైన నీలకంఠేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.45,084 వచ్చినట్టు తెలిపారు. ఎంపీటీసీ బైరా నాగరాజు పాల్గొన్నారు.



హుండీ ఆదాయ లెక్కింపును పరిశీలిస్తున్న ఏసీ సత్యనారాయణ

పిఠాపురం పాదగయకు కార్తీకమాస ఆదాయం

రూ.46.72లక్షలు

పిఠాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి కార్తీకమాసంలో రూ.46.72లక్షల ఆదాయం సమకూరింది. అభిషేకాలు, పూజాది రుసుములు, దర్శనం టిక్కెట్లు, ప్రసాద విక్రయాలు, ఇతరత్రా మార్గాల్లో ఈ ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. 2023 కార్తీకమాసంతో పోల్చుకుంటే రూ.9.77లక్షలు ఆదాయం అదనంగా వచ్చిందని చెప్పారు. కార్తీక మాసోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, పురప్రముఖులు, అధికారులు, భక్తులు, సేవా సంఘాల ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. భక్తులకు మరింత మెరుగ్గా సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

బ్యాంక్ యాప్ ద్వారా సైబర్ మోసం

- ఏజెన్సీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో మరో సైబర్ నేరం
- రెండు ఎకౌంట్లో ఉన్న మొత్తం రూ.1.48లక్షలు గల్లంతు

మోతుగూడెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో రోజుకోచోట సైబర్ నేరాలు జరుగుతున్నా కొందరిలో అవగాహన లేక నేరాలు ఆగడంలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతం చింతూరు మండలం మోతుగూడెంలో గురువారం పప్పు చిరంజీవి అనే వ్యక్తి ఉదయం 10.30గంటలకు ఆయనకు ఫోన్ వాట్సాప్‌కు ఓ బ్యాంక్ యాప్‌నకు సంబంధించి నాలుగుసార్లు వాట్సాప్ మెసేజ్ వచ్చాయి. మెసేజ్ ఓపెన్ చేసి చదివే లోపు టకటకమని రెండు ఎకౌంట్లో ఉన్న డబ్బు రూ.1.48లక్షలు గల్లంతయ్యాయి. దీంతో లబోదిబోమంటూ బాధితుడు యూనియన్ బ్యాంక్ వద్దకు వెళ్లి మేనేజర్ విత్తనాల సత్యనారాయణను కలిసి పరిస్థితిని తెలియజేశారు. వెంటనే బ్యాంక్ మేనేజర్ స్పందించి హెడ్ ఆఫీస్ ముంబాయి ఫోన్ చేసి ఖాతాదారు అకౌంట్ హోల్డ్ చేశారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు నుంచి వాట్సాప్ ద్వారా ఎటువంటి సందేశాలు ఖాతాదారులకు పంపరని గుర్తించాలని తెలియజేశారు. ఒకవేళ సైబర్ నేరగాళ్లు ఇటువంటిని ఏమైనా పంపిస్తే అప్రమత్తమై బ్యాంకు వద్దకు వచ్చి తెలియజేయాలని, అనుమానాస్పద మెసేజ్‌ను ఎట్టి పరిస్థితుల్లోను ఓపెన్ చేయకూడదని విజ్ఞప్తి చేశారు. బ్యాంకు సమాచారం ఏదైనా వినియోగదారులకు తెలియపరిస్తే అది మామూలు మెసేజుల ద్వారా సమాచారం వస్తుందని, గుర్తించాలని తెలియజేశారు. ఈ మధ్యకాలంలో వివిధ రకాల యాప్‌ల ద్వారా సైబర్ మోసాలు ఎక్కువగా ఉన్నాయని, వాటి పట్ల అప్రమత్తమై ఉండాలని బ్యాంకు మేనేజర్ ఖాతాదారులు తెలియజేశారు. గతంలో జరిగిన ఘటనలో ఫోర్ బైలో రూ.75వేలు, పొల్లూరులో రూ.60వేలు, మోతుగూడెంలో రూ.70వేలు ఫోన్ యాప్ ద్వారా పంపి ఇలాంటి సంఘటనల్లో డబ్బులు మోసపోయారని సమాచారం.

ప్లాస్టిక్ సర్జరీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ప్రారంభం





- 100మందికి పైగా దేశవ్యాప్త ప్లాస్టిక్ సర్జన్లు హాజరు
- రెండు సెషన్లుగా నిర్వహణ
- మృతదేహంపై ప్రయోగాత్మకంగా శాస్త్రీయ ప్రక్రియలు
- లైవ్‌డెమానిస్ట్రేషన్ ద్వారా ప్రదర్శన
- మరో రెండురోజులపాటు సదస్సు

కాకినాడ జీజీహెచ్‌లో మృతదేహంపై ప్రయోగాత్మకంగా శాస్త్రీయ ప్రక్రియలను లైవ్ డెమానిస్ట్రేషన్ ద్వారా ప్రదర్శన ఇస్తున్న ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు.. తిలకిస్తున్న వైద్యవిద్యార్థులు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్, రీకనస్ట్రక్టివ్ అండ్ ఈస్తటిక్ సర్జన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ(ఏపీఆర్ఏఎస్ఏటీఎన్) 21వ ప్లాస్టిక్ సర్జన్ల రాష్ట్రస్థాయి సదస్సు కాకినాడ రంగరాయ వైద్యకళాశాల, కాకినాడ జీజీహెచ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు వర్క్‌షాపులతో కూడిన సదస్సు గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఏపీఆర్ఏఎస్ఏటీఎన్ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రత్నభూషణ్ ఆధ్వర్యంలో జీజీహెచ్ ప్రాంగణంలోని ఫోరెన్సిక్ మెడిసన్ సెమినార్ హాల్లో హైదారాబాద్, పూణేకు చెందిన ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ వై.వెంకటరమణ, డాక్టర్ ఆశీష్ దావల్ భక్తలు ముఖ్య అతిథులుగా హాజరై లైవ్ డెమోనిస్ట్రేషన్ ద్వారా రెండు వర్క్‌షాపులను నిర్వహించారు.

ఉదయం.. మధ్యాహ్నం..

ఉదయం సెషన్‌లో ఫేషియల్ ఈస్తటిక్స్‌పై కడావర్ డిసెక్షణ్ నిర్వహించారు. ఈ ప్రక్రియలో ముఖ్యంగా సౌందర్యంపై శాస్త్రీయ ప్రక్రియలను మృతదేహంపై ప్రయోగాత్మకంగా నిర్వహించారు. మధ్యాహ్నం సెషన్‌లో కోలకత్తాకు చెందిన ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర విక్రమ్ సింగ్ రాథోర్ ముఖ్యఅతిథిగా హాజరై జనరల్ సర్జరీ సెమినార్ హాల్లో బొటోక్స్, ఫిల్లర్స్, థ్రెడ్స్‌పై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాపులకు 100మందికి పైబడి ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణులు వివిధ రాష్ట్రాల నుంచి హాజరయ్యారు. శుక్ర, శనివారాల్లో జరగబోయే సదస్సు కాకినాడ వివేకానంద పార్క్ ప్రాంగణంలోని ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రత్నభూషణ్ తెలిపారు.

అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు 'తూర్పు' పురుషులు, మహిళల జట్టు ఎంపిక

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపాన సంత నూతలపాడులో ఈ నెల 7 నుంచి 12 వరకూ జరగనున్న 71వ అంతర్‌జిల్లాల పురుషులు, మహిళల కబడ్డీ క్రీడా పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ గురువారం పూర్తి చేశామని, పోటీల్లో పాల్గొనేందుకు జట్టు సభ్యులు గురువారం సాయంత్రం రైలులో బయలుదేరి వెళ్లారని ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్, కోశాధికారి నిమ్మకాయల కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం రాత్రి వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా తరఫున పాల్గొనే పురుషుల, మహిళల జట్టు క్రీడాకారులకు క్రీడా దుస్తులను సామర్లకోట టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగపు ఉపాధ్యక్షులు, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్(చిన్ని) సౌజన్యంతో అందజేశామన్నారు. ఈ రెండు జట్ల క్రీడాకారులకు కోచ్‌గా పోతుల సాయిప్రసాద్ వ్యవహరిస్తారని కార్యదర్శి శ్రీనువాస్, కోశాధికారి కిరణ్ కుమార్ తెలిపారు.

పురుషుల జట్టు: కె.శ్రీనివాస్, వి.పవన్‌కుమార్, నాగు, శ్రీహరి, మనోహర్, దుర్గారావు, డేవిడ్, వెంకటనాథ్, ప్రశాంత్, నవీన్, మణి, ప్రవీణ్‌లు ఉన్నారు.

మహిళల జట్టు: అపరంజిత, పరిమళ, నాగమణి, అరుణ, ఆషీకం, వర్షిత, లీలా, భవాని, దీపిక, మంజుల, వెంకటలక్ష్మి, జీవనజ్యోతి.



ఎంపికైన ఉమ్మడి జిల్లా కబడ్డీ క్రీడాకారులతో కోచ్ తదితరులు

బాలిక అదృశ్యం మిస్టరీ

- కిడ్నాప్‌నకు గురైందంటూ తల్లిదండ్రుల ఆరోపణ
- బాలికను స్కూల్ నుంచి తీసుకెళ్లిపోయిన ఓ మహిళ

అమలాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న 14ఏళ్ల బాలిక అదృశ్యం మిస్టరీగా మారింది. ఆ బాలిక కిడ్నాప్‌కు గురైందా లేక అదృశ్యమైందా అనేది చర్చనీయాంశమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మలికిపురం మండలం తూర్పుపాలెంగ్రామానికి చెందిన బాలిక స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఆ గ్రామంలోని చికెన్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి భార్య మూడురోజులక్రితం హైస్కూల్‌కు వెళ్లి బాలికకు మాయమాటలు చెప్పి స్కూల్‌నుంచి తీసుకెళ్లి తర్వాత బయట నుంచి ఓ మోటారుసైకిల్‌పై ఉన్న యువకుడితో వారు వెళ్లినట్లు సమాచారం. అక్కడ సీసీ కెమెరాలను అదేరోజు సాయంత్రం పరిశీలించిన బాలిక తల్లిదండ్రులు ఈ వ్యవహారంపై మలికిపురం పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు మాత్రం బాలిక అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి ఆలస్యంగా దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగి మూడురోజులు కావడంతో బాలిక ఆచూకీపై తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. బాలికను ఉద్దేశపూర్వకంగానే కిడ్నాప్ చేశారా లేక బాలిక అదృశ్యమైందా అనే దానిపై పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది. అయితే బాలిక అదృశ్యంపట్ల పోలీసులు నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగా దోహదం

- నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్
- విశ్వవిద్యాలయ యోగా జట్టు ఎంపిక

దివాన్‌చెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగా దోహదపడుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ వర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో యోగా అంతర్ కళాశాలల పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలు గురువారం నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ అనుబంధ కళాశాలల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు యోగా దోహదపడుతుందని, యోగాసనాల్లో విద్యార్థులంతా పట్టు సాధించి ఆరోగ్యవంతమైన సమాజానికి కృషిచేయాలన్నారు. ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల మాట్లాడుతూ యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఎనిమిది మంది వంతున విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశామని తెలిపారు.



అఖిలభారత యోగా పోటీలకు ఎంపికైన నన్నయ పురుషుల, మహిళల జట్టు

పురుషుల జట్టు: టి.సూర్య, జి.స్వామి(ఎస్కేవీటీ ప్రభుత్వడిగ్రీకళాశాల,రాజమహేంద్రవరం), టి.పవన్‌కుమార్, కె.పవన్‌కుమార్, డి.మణికంఠ, జె.మణిసత్య(ఆకుల శ్రీరామ డిగ్రీ కళాశాల, తణుకు) పి.సత్తిబాబు, ఎం.హరింద కిషోర్(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమండ్రి) ఎంపికయ్యారు.

మహిళల జట్టు: బి.భవానిప్రసన్న, బి.నాగలక్ష్మీదుర్గ, కె.జ్యోతి, ఎ.సౌమ్య నాగవల్లి(ఎస్కేఎస్‌డీ మహిళా కళాశాల, తణుకు) సీహెచ్ మాధవి(డీఎన్ఆర్ కళాశాల, భీమవరం) టి.లావణ్య, పి.నాగలక్ష్మి(ఆకుల శ్రీరామ డిగ్రీ కళాశాల, తణుకు), కె.హర్షనదేవి(ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం) ఎంపికయ్యారు. వీరు ఈనెల 24 నుంచి 27 వరకూ భువనేశ్వర్‌లోని కిట్ విశ్వవిద్యాలయంలో అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయం పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శులు కె.బాలసత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, పరిశీలకుడు ఎల్.రమేష్, ఎంపిక కమిటీ సభ్యులు శివశంకర్, ఇ.గౌరిఅనూష, వ్యాయామ విద్యఅధ్యాపకులు బి.రామ్‌గోపాల్, డేవిడ్, సుబ్రహ్మణ్యం బాషా పాల్గొన్నారు.

కణుపూరు వీఆర్వో ఆత్మహత్యాయత్నం

గోకవరం/కోరుకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం కణుపూరు గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న తామడ సత్యనారాయణ ఆత్మహత్యకు యత్నించారు. విధి నిర్వహణలో భాగంగా తీవ్రఒత్తిడి, అప్పులబాధ, కుటుంబ తగాదాల నేపథ్యంలో ఈనెల 4న పురుగుల మందు తాగారని, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానేఉందని సమాచారం. కాగా సత్యనారాయణ స్వగ్రామం గోకవరం మండలం వెదురుపాక గ్రామం. కాగా గోకవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణను గురువారం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు పరామర్శించారు. ఆయన

పురుగుల మందు తాగిన రెవెన్యూ అధికారి

యోగక్షేమాలను కుటుంబసభ్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో సంఘం నాయకులు మంగి అప్పలనాయుడు, అనంతరపు శ్రీనివాసరావు, పి.శంకర్రావు తదితరులున్నారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర రాజు మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ అధికారుల వైఖరిలో మార్పు రాలేదని, మార్పు రాకపోతే జిల్లావ్యాప్తంగా వీఆర్వోలు విధులు బహిష్కరిస్తారని పేర్కొన్నారు.

'క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి'

కరప, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి సూచించారు. నడకుదురు ఎంపీపీ పాఠశాలలో గురువారం ఆమె విద్యార్థులతో ముచ్చటించారు.

'చిరువ్యాపారులు రుణచెల్లింపులు చేయాలి'

సామర్లకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారుల ఆర్థిక స్థితిగతులు పెంపొందించేందుకు ప్రభుత్వం, బ్యాంకర్లు సంయుక్తంగా అందిస్తున్న రుణ పథకాలను సద్వినియోగం చేసుకోవడమేగాక రుణ చెల్లింపులు సక్రమంగా చెల్లించి మరిన్ని రుణాలు అందించేందుకు కృషిచేయాలని పలు బ్యాంకుల మేనేజర్లు సీతారామ, ఎం.కృష్ణమోహన్‌లు పేర్కొన్నారు. సామర్లకోట మెప్మా భవనంలో గురువారం సామర్లకోట పట్టణ పరిధిలో చిరువ్యాపారులకు వివిధ బ్యాంకుల అధికారులు రుణ చెల్లింపులపై అవగాహన సదస్సు మెప్మా సీఎంఎం సయ్యద్‌హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రుణ చెల్లింపులు నిర్వహించని వ్యాపారులు డిఫాల్టర్లుగా నమోదవుతారని వారికి ఏ బ్యాంకులోనూ రుణాలు మంజూరుకావన్నారు. చిరువ్యాపారుల కుటుంబ భవిష్యత్ కోసం అమలులో ఉన్న పెన్షన్ స్కీమ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో మెప్మా సీవోలు, ఆర్పీలు, చిరువ్యాపారులు పాల్గొన్నారు.

ఘనంగా గంటాలమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ

కరప, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లపువీధిలో పునఃనిర్మించిన ఆలయంలో గురువారం గంటాలమ్మతల్లి, సాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా జరిగింది. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని తొలగించి గ్రామస్థులు, దాతల సహకారంతో కేవలం నెలల వ్యవధిలో ఈ నూతన ఆలయాన్ని నిర్మించారు. బుధవారం నుంచి ప్రతిష్ఠా కార్యక్రమాలు కొనసాగాయి. గురువారం ఉదయం వేదపండిల ఆధ్వర్యంలో గణపతిపూజ, సహస్ర దేవతారాధన, హోమం, యంత్రప్రతిష్ఠాపన, విగ్రహశిఖర ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, శిఖరాభిషేకం, కుంభదృష్టి, గోదృష్టి, మహదాశీర్వచనం, తదితర పూజాధికాలను శాస్త్రోక్తంగా నిర్వహించి అమ్మవారి, సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామ ఆడపడుచులు, మహిళలు ఈ ప్రతిష్ఠామహోత్సవానికి విచ్చేసి శిఖరంపై బూరెలు వేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'ఇంటర్‌లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలి'

కాకినాడ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌లో 100శాతం ఉత్తీర్ణత సాధనే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇంటర్ బోర్డు సూచనలతో సంకల్ప-25ను ప్రత్యేక ప్రణాళికతో అమలుచేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.తిరుపతి తెలిపారు. ప్రభుత్వం త్వరలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం ఏర్పాటుచేయనుందని దానికి సంబంధించిన ఏర్పాట్లు కళాశాలలో చేస్తున్నామన్నారు. సంకల్ప-25లో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిగణనలోనికి తీసుకుని వారిని ఏ, బీ,సీ కేటగిరీలుగా విభజిస్తామని, వారికి ముగ్గురు ప్రత్యేక అధ్యాపకులను కానీ అధ్యాపకేతర సిబ్బందిని కానీ కేటాయించి స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఘనంగా నేల దినోత్సవం

పెద్దాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరు గ్రామంలో ప్రపంచ నేలదినోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎఫ్‌టీసీ డీడీ వీఎస్‌సీ హరి హాజరై మాట్లాడారు. భావితరాలకు ఆరోగ్యవంతమైన నేలను అందించాలంటే రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏవోలు సంజయ్‌కుమార్, సంజీవ్, ఏఈవో రాగ స్రవంతి, వీఏఏలు అమృతవర్షిణి, విజయదుర్గ, రైతులు మేడిది శ్రీనివాస్, బొడ్డు బాబూరావు, కాకర్ల సూరిబాబు, పబ్బు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సినీ నటుడు బాలకృష్ణకు సత్కారం


బాలకృష్ణకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న చంద్రమౌళి

కాకినాడ రూరల్/సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడలో వేగ జ్యూయలర్స్ ప్రారంభోత్సవానికి గురువారం విచ్చేసిన సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను నటరత్న కళా మందిర్ తరపున గజమాలతో సత్కరించారు. మధురపూడి విమానాశ్రయంలో బాలకృష్ణకు కళామందిర్ వ్యవస్థాపకుడు పుచ్చకాయల చంద్రమౌళి, తురగా సూర్యారావు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ నటరత్న కళామందిర్ ద్వారా చంద్రమౌళి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. తురగా సూర్యారావు, ఎంఎస్ కుమార్, పి.గోపికృష్ణ పాల్గొన్నారు.

షష్ఠి వేడుకలకు ఆలయాల ముస్తాబు

కరప, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 7వ తేదీన జరిగే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. గొర్రిపూడి, కొరుపల్లి, కరప, వేళంగి, సిరిపురంలోని ఆలయాలను నిర్వాహకులు విద్యుత్ కాంతులతో అలంకరించారు. గొర్రిపూడి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారంరాత్రి స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

● పోలింగ్ సరళిని పరిశీలించిన అధికారులు


కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న ఆర్డీవో


పెద్దాపురంలో పోలింగ్ ప్రకియను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీరమణి

కాకినాడసిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలోని 38వ నంబర్ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని ఆర్డీవో ఎస్.మల్లిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఉపాధ్యాయ ఓటర్లను ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

పెద్దాపురం డివిజన్‌లో 92.21 శాతం పోలింగ్

పెద్దాపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 899 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. డివిజన్ పరిధిలోని 829 ఓట్లు పోలైయ్యాయని, 92.21 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి పేర్కొన్నారు. తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.

తాళ్లరేవు : మండలంలో ఉపాధ్యాయ ఓటర్లు 83మంది ఉండగా 78మంది మాత్రమే ఓటును వినియోగించుకున్నారు. 5గురు ఉపాధ్యాయులు గైర్హాజరైనట్లు ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి కె. వీరబాబు తెలిపారు. పోలింగ్‌కేంద్రాన్ని కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ త్రిపాఠిల్ పరిశీలించారు.

గొల్లప్రోలు: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 65మంది ఉపాధ్యాయ ఓటర్లుకు గానూ 62 మంది తమఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఎన్నికల నిర్వహణ ప్రశాంతం

ఎమ్మెల్సీ పోలింగ్ పరిశీలించిన అబ్జర్వర్, ఎస్పీ

పిఠాపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ హర్షవర్ధన్ తెలిపారు. పిఠాపురం తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని అబ్జర్వర్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ గురువారం పరిశీలించారు. పోలింగ్ సరళిపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వారు చెప్పారు. కాగా పోలింగ్ కేంద్రాన్ని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు సందర్శించారు. పోలింగ్ కేంద్రం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 200 మంది ఉపాధ్యాయ ఓటర్లకుగానూ 184మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

నాన్ టీచింగ్ ఉద్యోగి ఓటుపై అభ్యంతరం

సామర్లకోట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియలో సూరంపాలెం విద్యాసంస్థకు చెందిన ఒక ఉద్యోగి నాన్‌టీచింగ్ కేటగిరిలో తప్పుడు పద్ధతి ద్వారా ఓటుహక్కు పొంది ఓటు వేయడాన్ని సామర్లకోట ఎంపీడీవో కార్యాలయంవద్ద పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. సదరు ఉద్యోగి అకౌంటెంట్‌గా పనిచేస్తున్నా లైబ్రేరియన్‌గా తప్పుడు ధ్రువపత్రాలతో ఓటుహక్కు పొందినందున సదరు ఓటు వేయకుండా నిరోధించాలని యూటీఎఫ్ జిల్లా నాయకులు పి.గిరిధర గోపాలరావు తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు అందజేస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద కొద్దిసేపు వాగ్వివాదం నెలకొంది. ఇదే విధానంలో తప్పుడు ధ్రువపత్రాలతో ఓటు హక్కు పొందిన అదే కళాశాలకు చెంది మరో నలుగురు వ్యక్తులు ఓటు వేయకుండా నిరోధించడంలో ఉపాధ్యాయ సంఘాలు విజయవంతం అయ్యారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాలతోపాటు ప్రజాప్రతినిధుల దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని సంఘ జిల్లా నాయకులు గిరిధర గోపాలరావు వెల్లడించారు. సామర్లకోట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ లో సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 178 ఓట్లుకుగాను 162 ఓట్లు పోలవ్వడం ద్వారా 91.01 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి చెప్పారు. వీటిలో 99మంది పురుషులు, 63మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సామర్లకోట పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాకినాడ అడిషనల్ ఎస్పీ సామర్లకోట పోలింగ్ బూత్‌ను సందర్శించి ఓటింగ్ శాతం తెలుసుకున్నారు.

కరప: మండలం పరిధిలో 75మంది ఉపాధ్యాయులుండగా వారు ఓటేయడానికి కరప పంచాయతీ కార్యాలయంలో 42వ పోలింగ్‌బూత్‌ను ఏర్పాటు చేశారు. 69మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా కరప ఎస్ఐ తోట సునీత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కలశాలతో గ్రామోత్సవం



గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో వేంచేసి ఉన్న బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి 7వ షష్ఠి మహోత్సవ సంబరాలు గురువారం ప్రారంభమయ్యాయి. సుమంగళి స్త్రీలు, చిన్నారులు 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి కల్యాణం కనులపండువగా జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనగా, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

టీటీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పెద్దాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి టీటీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 22 వరకూ రాష్ట్రస్థాయిలో ఈ పోటీలు జరగనున్నాయి. క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం శ్రీప్రకాష్‌లో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.మోహన్‌బాబు నిర్వహించారు. ఎంపిక కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ ప్రారంభించారు. రాష్ట్ర టీటీ అసోసియేషన్ చీఫ్ రిఫరీ వేణుగోపాల్,అసిస్టెంట్ రిఫరీ శ్రీరామ్ ఆధ్వర్యం లో నిర్వహించారు. కోచ్‌లుగా వేణుగోపాలరావు, శ్రీరామ్, సింగంరాజు అరుణ్‌కుమార్ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు..

సబ్‌జూనియర్స్ అండర్-15(బాయ్స్) విభాగంలో ఎంటీఎస్ గోపీచంద్, శ్రవణరాజ్, ప్రహర్ష, సాయిశ్రవణ్, సబ్ జూనియర్స్ అండర్-15(గరల్స్) విభాగంలో శాంతిజ్యోతి, దర్శిక, సాయిసుదీక్ష, నయన, మెన్స్ విభాగంలో విఖ్యాత్, విజయధర్, మోహిత్, ఆనంద్, తనూష, ఉమెన్స్ విభాగంలో మహ్లాదాస్, శాంతిజ్యోతి, సాయిసుదీక్ష, దర్శిక, షరీఫ్ ఎంపికయ్యారు.

రైల్వేలో యూనియన్ గుర్తింపు ఎన్నికలు

సామర్లకోట రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీరు కార్యాలయంలో రెండోరోజు పోలింగ్

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే యూనియన్ గుర్తింపు ఎన్నికల సందర్భంగా సామర్లకోట బ్రాంచి పరిధిలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీరు కార్యాలయంలో రెండోరోజైన గురువారం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 662 ఓట్లు, రెండు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలవ్వడం ద్వారా 90శాతం ఓట్లు పోలైనట్లు సామర్లకోట సంఘ్ బ్రాంచి కార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు. మొత్తం 747మంది ఓటర్లు ఉన్నట్లు ఎం.రమేష్ చెప్పారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సామర్లకోట రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ ప్రశాంత వాతావరణలో జరిగేందుకు సహకరించిన రైల్వే అధికారులకు, రైల్వే పోలీసులకు, ఓటింగ్ విజయవంతం అయ్యేందుకు సహకరించిన రైల్వే కార్మికులకు, ఉద్యోగులకు బ్రాంచి కార్యదర్శి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘంటసాల కారణజన్ముడు

స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వేల్యూస్ అడ్వైజరీ సభ్యులు చాగంటి


బాపుశిష్యుడు గీసిన ఘంటసాల చిత్రపటం


ఘంటసాల చిత్రపటం ఆవిష్కరణ సభకి హాజరైన ప్రజలు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గానగాంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు కారణజన్ముడని, శివానుగ్రహంతో గొప్ప సంగీత గాయకులుగా ప్రేక్షకుల మదిలో చిరస్మరణీయులుగా నిలిచారని బ్రహ్మర్షి, స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వేల్యూస్ అడ్వైజరీ సభ్యులు డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఘంటసాల జయంతోత్సవాల్లో భాగంగా గురువారం రెండో రోజు కాకినాడ రూరల్ తిమ్మాపురం ఆకొండి లక్ష్మీ స్మారక గోశాల ప్రాంగణంలో ధర్మవర్ధిని ట్రస్ట్, శ్రీచాగంటి సత్సంగంల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చాగంటి స్వీయ రచనతో బాపు శిష్యుడుతో గీయించిన ఘంటసాల చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీతం పట్ల యోగి పుంగవుడు వలే నిరంతరం సంగీత సాధనలో సంగీత వాద్యాలతోనే తన జీవితాన్ని గడిపిన మహనీయుడన్నారు. అందుకే ఘంటసాల చుట్టూ సంగీత వాయిద్య పరికరాలను ఉండేట్లు, పులితోలుపై కూర్చున్నట్లుగా, తంబూరాను చేత పట్టుకున్నట్లు ఘంటసాల రూపకల్పన చేయించారన్నారు. ఘంటసాల చిత్రపటాన్ని ఇంతవరకూ ఎవరూ రూపకల్పన చేయలేనిరీతిలో మహాకావ్యంలా గీయించిన బ్రహ్మర్షి చాగంటికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఘంటసాల కంఠం, ఇగిరిపోని గంధం శీర్షికతో ఆయన జయంతి కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తున్న చాగంటి సత్సంగానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని దివిలి, తిరుపతి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే పనులను నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, పంచాయతీరాజ్ డీఈ పసుపులేటి రామకృష్ణయ్య, రాగాల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దివిలిలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

కళాశాల భవనాల స్థితిగతులపై పరిశీలన


ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నూకరాజు

పిఠాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పురాతన భవనాలను ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి నూకరాజు గురువారం పరిశీలించారు. భవనాల శిథిలావస్థకు చేరాయని, వాటిని తొలగించాలని అందిన వినతులతో ఇంటర్మీడియట్ బోర్డు కమిషనరు ఆదేశాల మేరకు ఆయన పరిశీలన జరిపారు. 1915లో నిర్మించిన ఈ భవనం శిథిలమయిందని, దీన్ని తొలగించి నూతన భవనాలు నిర్మిస్తే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. కమిషనరుకు నివేదిక ఇస్తామని తెలిపారు.

నేటినుంచి రెండు పూటలా తరగతులు

ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులను శుక్రవారం నుంచి రెండు పూటల నిర్వహించనున్నారు. ఇదే కళాశాల ఆవరణలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడంతో దశాబ్ద కాలంపైగా డిగ్రీ తరగతులను ఉదయం, ఇంటర్ తరగతులను మధ్యాహ్నం నుంచి నిర్వహిస్తున్నారు. పాదగయ సమీపంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనాలు నిర్మించి ప్రారంభించిన నేపథ్యంలో ఈనెల 11 నుంచి అక్కడ డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో భవనాలు అన్ని అందుబాటులోకి రావడంతో రెండు పూటలా తరగతుల నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు.

'పక్కాగృహాలకు అర్హులను గుర్తించాలి'

పిఠాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పక్కాగృహాలు నిర్మించునేందుకు స్థలం ఉన్న అర్హులను, ఇంటి స్థలాలు లేని వారిని గుర్తించాలని పిఠాపురం మునిసిపల్ కమిషనరు ఎస్.కనకారావు, ఎంపీడీవో చిన్నారావులు సూచించారు. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో వార్డు, గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనా 2.0 ద్వారా పక్కా గృహాల నిర్మాణానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందజేస్తాయని తెలిపారు. ఒక్కొక్క ఇంటికి రూ.2.50లక్షల వంతున అందజేస్తారని చెప్పారు. గృహాలకు జియో ట్యాగింగ్, ఎన్‌సీపీఐ సర్వే పూర్తి చేయాలని సూచించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారిని గుర్తించాలని తెలిపారు. గృహాలకు అర్హుల గుర్తింపును పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

కలెక్టర్ ఆదేశించినా ఫిర్యాదు స్వీకరించని డీఎస్పీ

● డిప్యూటీ సీఎం వారించినా వినలేదు: వర్మ

కొత్తపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రసాయనాల పరిశ్రమల పైప్‌లైన్ ఏర్పాటులో మత్స్యకారపెద్దలు డబ్బులు తీసుకొన్నారన్న ఆరోపణపై కలెక్టర్ తరపున ఆర్డీవో మల్లిబాబు ఫిర్యాదు తీసుకోవాలని డీఎస్పీని కబురు పంపినా ఖాతరు చేయలేదని మాజీ ఎమ్మెల్యే వర్మ జిల్లా ఎస్పీ విక్రమ్‌పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. మత్స్యకారులు చేస్తున్న ధర్నా వద్దకు వచ్చి సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోగా సుమోలో కూర్చోవడాన్ని ఎస్పీకి వివరించారు. మత్స్యకారులు, వాళ్ళ పెద్దలు డబ్బులు తీసుకున్నారన్న ఫిర్యాదు చేస్తారని ఆర్డీవో చెప్పినా డీఎస్పీ స్పందించకపోవడాన్ని ఎస్పీకి వివరించారు. ఇటీవల కాకినాడలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ బియ్యం బస్తాల విషయంలో డీఎస్పీని గట్టిగా మందలించిన విషయాన్ని ఎస్పీకి వివరించారు. మత్స్యకార పెద్దలు ఇచ్చిన ఫిర్యాదును ఎస్పీకి సమర్పించారు.


జిల్లా ఎస్పీకి మత్స్యకారులతో ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యేవర్మ

పాదగయ పుష్కరిణలో నీరు తొలగింపు ప్రారంభం


పిఠాపురం పాదగయ పుష్కరిణిలో నీటిని తొలగిస్తున్న దృశ్యం

పిఠాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ పుష్కరిణిలో నీటి తొలగింపును ప్రారంభించారు. కార్తీక మాసం నెలరోజులపాటు పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడం, అరటిడొప్పల్లో దీపాలు వెలిగించి పుష్కరిణిలో వదలడం, పూజా సామాగ్రి కలపడంతో నీరు రంగు మారింది. ఈనేపథ్యంలో నీటిని మార్చాలని నిర్ణయించి ప్రస్తుతం మోటార్లు ద్వారా నీటిని తొలగిస్తున్నారు. పుష్కరిణిని శుభ్రం చేసి మరలా కొత్తగా నీరు పెట్టనున్నారు. కొత్తగా నీరు పెట్టేవరకూ భక్తులు స్నానాలు ఆచరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహనశ్రీనివాస్ తెలిపారు.

జీజీహెచ్‌ను సందర్శించిన అడిషనల్ డీఎంఈ


అత్యవసర విభాగంలో రికార్డులను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంఈ

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేష్ కాకినాడ జీజీహెచ్‌ను గురువారం సందర్శించారు. ఆయన డిప్యూటీ సూపరింటెండెంట్ డా. ఎంపీఆర్ విఠల్‌తో కలిసి అత్యవసర విభాగానికి చేరుకుని పలు రికార్డులను తనిఖీచేసి రోగులకు, క్షతగాత్రులకు అందుతున్న అత్యవసర మందుల గురించి, మౌళిక సదుపాయాలు గురించి అక్కడ విధుల్లో ఉన్న సీఎంవోను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆర్థో ఓపీతోపాటు పలు ఓపి విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చేవారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు.

న్యాయం చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన


ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

పెద్దాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం రంగాపురంలో చెట్టు కొమ్మలు కొడుతుండగా 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి దుళ్ల సుబ్రహ్మణ్యం(35) అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. కేవలం విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక నిండు ప్రాణం బలయ్యిందని మృతుని బంధువుల ఆరోపించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. దీంతో కాసేపు ఆసుపత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మృతుల బంధువులతో అధికారులు చర్చలు జరిపి వారిని శాంతింపచేశారు.

'ఉపాధ్యాయులపై దాడులు అరికట్టాలి'

ప్రత్తిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో ఉపాధ్యాయులపై విద్యార్థుల దాడిని నిరసిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. దాడులు అరికట్టాలని ఎంఈవో వి.రాజబాబుకు వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ప్రతినిధులు సుంకర శ్రీనివాస్, ఎస్.రాజేష్, ఎన్.శ్రీనివాస్, కేవీఎస్ సుబ్రహ్మణ్యం, పి.స్వప్న, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రౌతులపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.చామవరంలో సారా బట్టీపై తుని ఎస్ఐ శాస్త్రి ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఎస్‌హెచ్‌వో వై.పట్టాభిచౌదరి పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక







ప్రత్తిపాడులో పోలింగ్ తీరును పరిశీలిస్తున్న అధికారులు

తుని, రౌతులపూడిల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉపాధ్యాయులు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఓటెత్తిన ఉపాధ్యాయులు

జగ్గంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ ప్రక్రియను తహసీల్దారు రమేష్‌బాబు, సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. 43 మంది ఉపాధ్యాయులకు 40 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో 32 ఓట్లకు 28 ఓట్లు పోలైనట్టు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని కాకినాడ అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు పరిశీలించారు. గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు, పెద్దాపురం సీఐ టి.క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ పోలింగ్ కేంద్రంలో 71 మందికి 69 మంది ఓటు వేశారు. 97.2 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల ప్రక్రియను తహసీల్దారు ఎం.సూర్యప్రభ, అడిషనల్ ఎస్పీ ఎన్‌సీవీ భాస్కరరావు, ఎస్ఐ ఎస్.సూర్యకాంతం పర్యవేక్షించారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 44 ఓట్లకు 43 ఓట్లు పోలయ్యాయి. 97.67 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల నిర్వహణ అధికారులు తెలిపారు

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): తుని నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలాల వారీగా... తునిలో 261 ఓట్లకు 231, కోటనందూరులో 23 ఓట్లకు 23 , తొండంగిలో 61కి 59 ఓట్లు పోలయ్యాయి.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 101 మందికి గాను 97 మంది ఉపాధ్యాయులు ఓటేశారు. పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు ఆర్వీ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఎస్ఐ రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

తొండంగి (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌లో 61 మందికి 59 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): మండలంలో 54 మందికి 49 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 90శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. ఎన్నికల సరళిని ఉభయ గోదావరి జిల్లాల ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు పోతురాజు, ఎంపీడీవో శర్మ వున్నారు.



కూనవరంలో ఓటు వేసిన ఉపాధ్యాయులు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

చింతూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 37 ఓట్లకు 33 ఓట్లు పోలైనట్టు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ఎన్నికల ప్రక్రియను తహసీల్దారు చిరంజీవి, సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రమేష్ పర్యవేక్షించారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. 41 మంది ఉపాధ్యాయులకు 40 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రాజవొమ్మంగి (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 121 మందికి 96 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 79 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దారు అల్లు సత్యనారాయణ తెలిపారు. సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట హైస్కూలు పోలింగ్ కేంద్రంలో 58 ఓట్లకు 54 ఓట్లు పోలయ్యాయి. రంపచోడవరం సీఐ రవికుమార్, దేవీపట్నం తహసీల్దారు సత్యనారాయణ, ఎస్ఐ షరీఫ్ ఎన్నికను పర్యవేక్షించారు.

వై.రామవరం (ఆంధ్రజ్యోతి): స్థానిక 7వ నెంబరు పోలింగ్ బూత్‌లో 79.41 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి డీటీ సుధాకరరావు తెలిపారు. 34 ఓట్లకు 27 ఓట్లు పోలయ్యాయన్నారు. పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు వేణుగోపాల్ తనిఖీ చేశారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో పది మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని తహసీల్దారు కారం సుబ్బారావు పరిశీలించారు.



రాజవొమ్మంగిలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉపాధ్యాయురాలు



ఎటపాకలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న తహసీల్దారు సుబ్బారావు



దేవీపట్నం మండలం ఇందుకూరుపేట ఉన్నత పాఠశాలలో...



వై.రామవరం మండలంలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్నతహసీల్దారు వేణుగోపాల్

'మెరుగైన వైద్య సేవలందించాలి'



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం


రంపచోడవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అసిస్టెంట్ కలెక్టర్ భావనతో కలిసి స్థానిక ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ సెంటర్, ప్రసూతి శిశు ఆరోగ్య నూతన భవనం, సికిల్ సెల్ ఎనీమియా విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నూతన భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ టీవీ శేషారెడ్డి, వైద్యాధికారి ప్రేమ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 33/11కేవీ విద్యుత్ లైనులో భారీగా పెరిగిన చెట్ల తొలగింపులో భాగంగా శుక్రవారం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

రేపటి నుంచి షష్ఠి ఉత్సవాలు

దేవీపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫజుల్లాబాద్ గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు శనివారం ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.



మారేడుమిల్లి వ్యూ పాయింట్ నుంచి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న దృశ్యం

మంచు మేఘాలలో...

మోతుగూడెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మన్యంలో గురువారం తెల్లవారుజామున మంచు మేఘాలు కనువిందు చేశాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని తులసిపాక వ్యూ పాయింట్, రంపచోడవరం మండలం మారేడుమిల్లి వ్యూ పాయింట్ నుంచి ఈ దృశ్యాన్ని చూసి సందర్శకులు పులకించిపోయారు. కొండలపై పరుచుకున్న మేఘాలను చూసి ఆస్వాదించారు.

'ఐలాజ్ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి'

అన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలో ఈ నెల 8వ తేదీన జరిగే ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకుడు బుగతా శివ కోరారు. గురువారం ఆయన స్థానిక న్యాయవాదులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై చర్చించారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని, న్యాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని, న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని శివ కోరారు. న్యాయవాదులు రాజేష్, యడ్ల శ్రీనివాస్, పోతుల జోగేష్, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'రోగులతో మర్యాదగా ఉండాలి'

తుని రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుని ఏరియా ఆసుపత్రి సిబ్బందితో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు గురువారం తుని పట్టణ సీఐ గీతారామకృష్ణ, రూరల్ సీఐ చెన్న కేశవరావులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైద్యులతో మాట్లాడి పలు సమస్యలపై ఔట్ సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బందితో చర్చించారు. రోగుల పట్ల సానుకూలంగా ఉండాలని, అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రత్తిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టి.రాయవరంలో గురువారం డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి పర్యటించారు. గ్రామంలో పూర్తయిన మూడు సీసీ రోడ్ల నాణ్యతా ప్రమాణాలను చూశారు. నిర్మాణ దశలో ఉన్న పశువుల షెడ్లను పరిశీలించారు. మండల ఇంజనీరింగ్ అధికారి ప్రకాష్, ఉపాధి ఏపీవో కుమార్, సర్పంచ్ తటవర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

కార్మిక నేతకు మాతృ వియోగం

ప్రత్తిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘ నాయకుడు పత్రి రమణ తల్లి గురువారం రాత్రి మృతి చెందారు. రమణ కుటుంబీకులను పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను, జనసేన నాయకుడు గోపిశెట్టి శ్రీను తదితరులు పరామర్శించి సానుభూతి తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

ప్రత్తిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన 17 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ ప్రత్తిపాడు జడ్జి కాటం భాను గురువారం తీర్పు చెప్పారని సీఐ బి.సూర్యఅప్పారావు తెలిపారు. రౌతులపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో తాగుతూ పట్టుబడ్డ వారిలో ఒకరికి రూ.10వేలు, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరిలో ఒకరికి రూ.500, మరొకరికి రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ తుని మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు.

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా జగ్గంపేట సర్కిల్ పరిధిలో తాగి వాహనాలు నడుపుతున్న 11 మందిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచారు. 9 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున జరిమానా విధించారు. ఇద్దరికి రెండు రోజులు జైలు శిక్ష విధించారు. ఇద్దరిని సబ్ జైలుకు తరలించామని సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు.



ప్రతిభ కనబరిచిన పాలిటెక్నిక్ విద్యార్థులు

పాలిటెక్ ఫెస్ట్‌లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

గండేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్‌లో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన పాలిటెక్ ఫెస్ట్‌లో సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్ తెలిపారు. కె.విజయ్, పి.పురందేశ్వరి, ఎం.సోనినవీన, ఎ.శ్రావణిలావణ్య ప్రదర్శించిన చేతి సంజ్ఞల ద్వారా నియంత్రించే దివ్యాంగుల చక్రాల కుర్చీ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతితో పాటు రూ.10వేలు నగదు బహుమతి లభించింది. మెకానిక్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ప్రదర్శించిన ప్రాజెక్టులు విజయవాడలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్‌కు ఎంపికయ్యాయి. విజేతలను డీన్ ఏవీ మాధవరావు, అసోసియేట్ డీన్ పి.శ్రీనివాస్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఆర్.శ్రీనివాస్ అభినందించారు.

ఘనంగా స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవం



స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలిని సత్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వందన యూత్ వలంటీర్ ఆర్గనైజేషన్ వులి ప్రసాద్ అధ్యక్షతన భవిత స్కూలు విద్యార్థుల మధ్య స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సీడీపీవో ఎం.పూర్ణిమ, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్ సేవా సంస్థల దాతృత్వాన్ని కొనియాడారు. అమ్మసాయి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరెడ్డి, శశి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు నరసింహమూర్తి, మణికర్ణిక స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు జి.అనూషలను సన్మానించారు. కె.అరుణ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

జగ్గంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొంగల రావిచెట్టు వద్ద గల లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో లయన్స్‌క్లబ్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను జగ్గంపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎంఎస్ బాలగంగాధర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. పాస్ట్ గవర్నర్ డాక్టర్ గోలి శ్రీరాములు, లయన్ కోడూరి రంగారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జగ్గంపేట లయన్స్ క్లబ్‌లో క్లబ్ ప్రెసిడెంట్‌గా, జోన్ చైర్మన్‌గా, రీజనల్ చైర్మన్‌గా, డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా పదవులు చేపట్టిన కొత్త వెంకటేశ్వరరావును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పాలకుర్తి సురేష్, డాక్టర్ కుమ్మరగంటి సత్యనారాయణ, అమల క్లినిక్ ల్యాబ్ పెద్ది సత్యనారాయణ, వి.శ్రీరామచంద్రమూర్తి, వల్లూరి గంగాధరరావు, సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ షాపులపై ఆకస్మిక దాడులు

గండేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలో 20, 21 రేషన్ షాపులతో పాటు రేషన్ పంపిణీ వాహనాన్ని విజిలెన్స్ తహసీల్దారు విజయ్‌కుమార్, పెద్దాపురం ఎంఎస్‌వో భారతి తమ సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు. షాపు నెం.20లో సుమారు 260 కిలోల బియ్యం, 200 కిలోల కందిపప్పు, షాపు నెం.21లో 133 కిలోల బియ్యం, 306 కిలోల కందిపప్పు గుర్తించారు. అధికారులు కేసు నమోదు చేసి షాపులను సీజ్ చేశారని గండేపల్లి తహసీల్దారు ఎ.శ్రీనివాస్ చెప్పారు.

'నేలతోనే జీవరాశుల మనుగడ'



ఏలేశ్వరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వ్యవసాయ అధికారిణి బి.జ్యోతి నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. సకల జీవరాశుల మనుగడకు నేల కీలకమని, దానిని రక్షించుకోకపోతే పంటలు పండవన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. రసాయనాలు ఎక్కువ వాడడం వల్ల నేల సారం కోల్పోతుందన్నారు. ర్యాలీలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 31/11కేవీ లైన్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తేటగుంట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వీరభద్రరావు తెలిపారు. తేటగుంట, గవరపేట, వెంకటాపురం, రాజుల కొత్తూరు, ఎర్రకోనేరు గ్రామాల్లో సరఫరా ఉండదని చెప్పారు.



యనమలతో ఎమ్మెల్యే రాజప్ప భేటీ

తుని రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తేటగుంటలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వీరు జిల్లాకు సంబంధించిన రాజకీయ అంశాలపై చర్చించారు. నాయకులు యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు, సుర్ల లోవరాజు, యనమల లక్ష్మణరావు, ఆరిగెల నరసింహమూర్తి, చోడరాజు చిరంజీవిరాజు పాల్గొన్నారు.

నేడు కనకదుర్గ అమ్మవారి ధార్మిక ప్రచార రథం రాక

జగ్గంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మ తల్లి ఆలయం వద్దకు శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు విజయవాడ కనకదుర్గ అమ్మవారి ధార్మిక ప్రచార రథం చేరుకుంటుంది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ-మణి దంపతులు, టీడీపీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్-లక్ష్మీదేవి దంపతులతో ప్రధానార్చకులు కుంకుమ పూజలు చేయిస్తారని ఆలయ కమిటీ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు.

ప్రశాంతంగా రైల్వే కార్మిక సంఘ ఎన్నికలు

తుని రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మిక సంఘ గుర్తింపు ఎన్నికల్లో భాగంగా తుని రైల్వే పీడబ్ల్యుఐ కార్యాలయంలో ఎన్నికల అధికారి జాన్ దేవ సహాయం నేతృత్వంలో పోలింగ్ నిర్వహించారు. తుని బ్యాచ్‌కు సంబంధించి 792 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రత్యక్షంగా 724 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 4 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారి చెప్పారు.

పార్థివ శివలింగానికి పూజలు

గండేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు పామాయిల్ తోటలో కర్నాకుల శివతాత దంపతులతో పార్థివ శివలింగానికి శివాలయం అర్చకుడు చంద్రమౌళి సుబ్బారావు శర్మ అభిషేకం, పూజలు చేయించారు. అనంతరం అన్నదానం చేశారు. కంటిపూడి సత్యనారాయణ, రామకుర్తి సత్తిబాబు, సిరిదెళ్ల అబ్బులు, రామకుర్తి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

'మఖాన పంట సాగుతో లాభాలు'

చింతూరు/వీఆర్‌పురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మఖాన సాగుతో రైతులు మంచి లాభాలు గడించే అవకాశం ఉందని నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ మఖాన శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మఖాన పంట సాగుపై చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ చొరవతో నేషనల్ రీసెర్చ్ ఫర్ మఖానకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఇందుశేఖర్ సింగ్(ప్రిన్సిపల్ సైంటిస్ట్) డాక్టర్ పడాల వినోద్‌కుమార్ (సైంటిస్ట్) గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, వీఆర్ పురం మండలాల్లోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషక విలువలు, ఔషధ విలువల దృష్ట్యా నీటిలో పెరిగే మఖాన పంటకు ప్రపంచవ్యాప్తంగా బాగా డిమాండ్ పెరిగిందన్నారు. ఈ పంట కాలపరిమితి 9-10 నెలలు. ఇది భారతదేశంలో ఎక్కువగా పండుతుంది. మట్టి నమూనాలు సేకరించి మఖాన సాగుకు అనుకూలంగా ఉందని సూచనప్రాయంగా తెలిపారు. పీవో మాట్లాడుతూ అనుకూలతను అనుసరించి ముందుగా కొన్ని గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తామన్నారు. పంట సాగుకు ఐటీడీఏ నుంచి ఆర్థిక సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పర్యటనలో రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మట్టిని పరిశీలిస్తున్న పీవో, శాస్త్రవేత్తలు

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

జగ్గంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాక శివారున రహస్యంగా పేకాడుతున్నట్టు సీఐకు వచ్చిన సమాచారం మేరకు ఆయన ఆదేశాలతో ఎస్ఐ రఘునాథరావు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,200 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.